

ఐత్రీ బ్లాక్ వద్ద బైఠాయించిన విద్యార్థులు

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ధర్నా

నూజివీడు టౌన్, ఏప్రిల్ 8: క్యాంపస్ విడిచివెళ్ళాలంటూ ఆర్జీయూకేటీ యాజమాన్యం ఆదేశాలతో విద్యార్థులు ధర్నాకు దిగారు. ఆర్జీయూకేటీ పరిధి లోని నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులు తమ అకాడమీ క్యాలెండర్ పూర్తయిన నేపథ్యంలో క్యాంపస్‌ను విడిచివెళ్ళాలని క్యాంప స్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ చదువుతున్న దాదాపు వెయ్యి మంది విద్యార్థులకు మెసేజ్‌లను పంపి యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తమ ప్రాజెక్టును, రివ్యూస్‌ను పూర్తి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సదరు ప్రాజెక్టు, రివ్యూస్ సమర్పణకు ఏప్రిల్ 10వ తేదీ చివరి రోజుగా ట్రిపుల్ ఐటీ క్యాంపస్ అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టులు సమర్పించేందుకు ప్రస్తుత ఆదేశాలు తమకు ప్రతిబంధకమని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఆర్జీయూకేటీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన టెక్ జెట్ వంటి టెక్‌ఫెస్ట్‌లు కూడా పూర్తికావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆర్జీయూకేటీ పరిధిలోని ఒంగోలు, శ్రీకాకుళం, ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లలో అకడమిక్ క్యాలెండర్ ఏప్రిల్ 25 వరకు అమలు చేస్తుండగా ఇక్కడ ఏప్రిల్ 8వ తేదీ చివరిరోజుగా పేర్కొంటూ క్యాంపస్‌ను విడిచివెళ్ళాలని ఆదేశాలు జారీ చేయటంపై విద్యార్థులు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఆఫీస్ ఐత్రీ బ్లాక్ వద్ద సోమవారం రాత్రి 9 గంటల వరకు నిరసన తెలిపారు. అభ్యంతరాలపై ఆర్జీయూకేటీ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్ళి మంగళవారానికి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతామని, ఆందోళన విరమించాలని ట్రిపుల్ ఐటీ సిబ్బంది విద్యార్థులకు నచ్చచెప్పడంతో వారు ఆందోళనను విరమించారు.

అరకొరగానే..

» పోల్ రాజ్ కెనాల్‌కు అదీ లేదు » నీటి విడుదల తీరిది





క్యాంప్ బెల్ కెనాల్‌కు గుడ్లవల్లేరు లాకుల వద్ద నీటి విడుదల (ఇన్‌సెట్) శ్రీహరిపురం వద్దకు చేరిన అరకొర నీరు

ముదినేపల్లి, ఏప్రిల్ 8 : కాల్వలకు అరకొరగానే నీరు విడుదల చేశారు. సోమవారం గుడ్లవల్లేరు లాకుల వద్ద క్యాంప్ బెల్ కెనాల్‌కు 270 క్యూసెక్కులు, బంటుమిల్లి కెనాల్‌కు 285 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, పోల్ రాజ్ కెనాల్‌కు ఇంకా నీరు విడుదల చేయలేదు. రైవస్ కెనాల్ నుంచి పుల్లేరుకు సుమారు 540 క్యూసెక్కుల నీటిని విడుదల చేయటంతో వచ్చిన నీటిని గుడ్లవల్లేరు లాకుల నుంచి క్యాంప్ బెల్, బంటుమిల్లి కాల్వలకు అధికారులు విడుదల చేశారు. నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున వంతుల వారీగా కాల్వలకు నీరు విడుదల చేయనున్నట్లు తెలిసింది. అయితే ప్రస్తుతం విడుదల చేసిన చాలీచాలని నీరు తాగునీటి అవసరాలకు, మంచినీటి చెరువులను నింపుకునేందుకు సరిపోదు. క్యాంప్ బెల్ కెనాల్‌కు 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తేనే కాల్వ శివారున ఉన్న కలిదిండి మండలానికి చేరే అవకాశం ఉంటుంది. ముదినేపల్లి మండలంలోని వైవాక, ఊటుకూరు, వాడవల్లి, దేవపూడి తదితర శివారు గ్రామాల చెరువులను నింపేందుకు బీఎండీ ఛానల్‌కు నీరు విడుదల చేయలేదు. సోమవారం సాయంత్రానికి క్యాంప్ బెల్ కెనాల్‌లో నీరు ముదినేపల్లి మండలం శ్రీహరిపురం వంతెన వద్దకు చేరాయి.



కాకరవాడ వద్ద కాల్వలను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ

తాగునీటి ఎద్దడి రానివ్వద్దు: ఎస్ఈ

ముదినేపల్లి, ఏప్రిల్ 8 : వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఏలూరు జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన ఏలూరు జడ్పీ సీఈవో కేఎస్ సుబ్బారావుతో కలసి ముదినేపల్లి మండలం శ్రీహరిపురం, కాకరవాడ, చేవూరు, దేవరం గ్రామాల్లో మంచినీటి చెరువులు, బావులు, క్యాంప్ బెల్ ప్రధాన పంటకాల్వలను ఆయన పరిశీలించారు. కాల్వలకు విడుదల చేసిన నీటిని తాగునీటి అవసరాలకు సక్రమంగా వినియోగించాలన్నారు. నీటి చౌర్యాన్ని అరికట్టేందుకు ఏర్పాటు చేసిన నిఘా కమిటీలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మంచినీటి చెరువులు, పశువుల చెరువులను పూర్తిస్థాయిలో నింపేందుకు పంచాయతీల కార్యదర్శులు తగిన ఏర్పాట్లు చేయాలని సీఈవో సుబ్బారావు తెలిపారు. ఎంపీడీవో మురళీ గంగాధరరావు, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ, పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కైకలూరులో ఉగాది మహోత్సవం

కైకలూరు, ఏప్రిల్ 8: శ్రీ క్రోధి నామసంవత్సర ఉగాది మహోత్సవాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించనున్నట్లు సాహితీ మిత్రుల ప్రధాన కార్యదర్శి చింతపల్లి వెంకట నారాయణ తెలిపారు. కైకలూరు శాఖా గ్రంథాలయంలో సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తామని ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

త్రివిధలో ఉగాది వేడుకలు



నూజివీడు టౌన్, ఏప్రిల్ 8: శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు నూజివీడు త్రివిధ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ఉగాదికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తెలుగు భాషోపాధ్యాయిని రంగనాయకమ్మ ఉగాది విశిష్టత, రుతువుల్లో వచ్చే మార్పులు వివరించారు. తెలుగుభాష, సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. త్రివిధ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ. 4 లక్షలు నగదు పట్టివేత

చాట్రాయి, ఏప్రిల్ 8: తెలంగాణ సరిహద్దున ఉన్న మండలంలోని కృష్ణారావుపాలెం చెక్‌పోస్టు వద్ద సోమవారం రూ.4 లక్షలు పట్టుకున్నట్టు తహసీల్దార్ మహ్మద్ మక్సూద్ అలీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పరిధిలోని గంగారం నుంచి విజయవాడ వెళుతున్న ట్రక్‌లో కొమ్మన బాల మునిబాబు వద్ద ఉన్న రూ. 4 లక్షల నగదుకు ఎటువంటి ఆధారాలు చూపకపోవటంతో సీజ్ చేసి నిబంధనల ప్రకారం నగదును ఏలూరు జిల్లా ట్రెజరీలో భద్రపర్చామని చెప్పారు.

ఓటు హక్కుపై కళాజాత

చాట్రాయి, ఏప్రిల్ 8: చీపురుగూడెం, కోటపాడు గ్రామాల్లో సోమవారం కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారుల బృందం ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించింది. డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చెయ్యాలని, మంచి ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుందని, కోడ్ ఉల్లంఘనలు జరిగితే సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చెయ్యాల ప్రజలకు వివరించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువత క్రీడల్లో నైపుణ్యం సాధించాలి



ముసునూరు, ఏప్రిల్ 8: గ్రామీణ యువత క్రీడల్లో నైపుణ్యం సాధించాలని సర్పంచ్ నక్కనబోయిన సత్యనారాయణ అన్నారు. కొర్లకుంటలో మూడు రోజులపాటు జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో సుమారు 25 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ స్థానంలో నిలిచిన సింహాద్రి అప్పారావు పేట బీ-టీమ్‌కు రూ. 25 వేలు, ద్వితీయ స్థానంలో సింహాద్రి అప్పారావు పేట ఏ-టీమ్‌కు రూ.15 వేలుతో పాటు షీల్డ్‌లను పీఏసీఎస్ అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, సర్పంచ్ అందజేశారు. గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు కొలుసు ప్రచారం

చాట్రాయి, ఏప్రిల్ 8: మండలంలోని చీపురుగూడెం, కోటపాడులలో మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి ప్రచారం నిర్వహిస్తారని టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కర్యకర్తలు అభిమానులు తరలివచ్చి జయప్రదం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.



చెక్కపల్లిలో జయహో బీసీ సభలో మాట్లాడుతున్న మహేష్ యాదవ్



వరహాపట్నంలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కామినేని



వెంకటాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

ముసునూరు, ఏప్రిల్ 8: టీడీపీ పాలనలోనే బీసీల అభివృద్ధి జరుగుతుందని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి, ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ అన్నారు. సోమవారం రాత్రి చెక్కపల్లిలో టీడీపీ జయహో బీసీ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లో కూడా బీసీలకు వైసీపీ తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. బీసీ డిక్లరేషన్‌తో బీసీల పక్షపాతిగా టీడీపీ చరిత్రలో నిలుస్తుందన్నారు. బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్, బీసీ సబ్ ప్లాన్ ద్వారా ఐదేళ్ళలో రూ. లక్షన్నర కోట్లు ఖర్చు చేయడం, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం, స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్ అమలు, ఆర్థికాభివృద్ధి, ఉపాధికి ప్రోత్సాహకాలు పునరుద్ధరించడం, చంద్రన్న బీమా రూ.10 లక్షలు, పెళ్ళికానుక కింద రూ. లక్ష అమలు, బీసీ డిక్లరేషన్‌తో బీసీలకు అన్నివిధాలా లబ్ధి చేకూరుతుందన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు బీసీలంతా అండగా ఉండాలన్నారు. కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న తమను గెలిపించాలని పార్థసారథి, మహేష్ యాదవ్ కోరారు. తొలుత టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో బారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యాక్రమంలో స్థానిక, మండల, నియోజకవర్గ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పేద, మధ్యతరగతి ప్రజల అభ్యున్నతి టీడీపీ పాలనతోనే సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లి గంగారామ్, తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గద్దె రఘుబాబు అన్నారు. సోమవారం గుడిపాడు ఎస్సీ కాలనీలో సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతి ఇంటికి కరపత్రాలను అందజేసి మాట్లాడుతూ సంక్షేమం పేరుతో కోట్లాది రూపాయలను జగన్‌రెడ్డి దోచుకున్నాడని, చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని, కూటమి అధికారంలోకి తేవాలని కోరారు.

కార్పొరేషన్ నిధులు స్వాహా చేశారు..

వైసీపీ ఐదేళ్ళ పాలనలో కేంద్రం నుంచి వచ్చిన కార్పొరేషన్ నిధులను స్వాహా చేశారని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవారం వలసపల్లి, యల్లాపురం, గుడిపాడు గ్రామాల ప్రజలతో జరిగిన ఆత్మీయ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ప్రతి కులానికి ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి చైర్మన్‌లను ఉత్సవ విగ్రహాలుగా తయారు చేశారని, కార్పొరేషన్‌ల ద్వారా ఒక రూపాయి రుణాన్ని కూడా ఇవ్వని అసమర్థ ప్రభుత్వం వైసీపీ అన్నారు. చంద్రబాబు మలవల్లిలో పరిశ్రమలు స్థాపించి, వేలాది మందికి ఉద్యోగాలు వచ్చేలా చేస్తే, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిశ్రమలను ప్రారంభించకుండా, ఉన్న పరిశ్రమలను మూతపడేలా చేసి నిరుద్యోగ యువత భవిష్యత్‌ను నాశనం చేసిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలన్నా, రాష్ట్రానికి పరిశ్రమలు రావాలన్నా, యువతకు ఉపాధి దొరకాలన్నా చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

ప్రత్యేక కమిటీలతో ప్రజల్లోకి : పార్థసారథి

నూజివీడు: కూటమిని విజయానికి ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేసి ప్రజల్లోకి సూపర్ సిక్స్ పథకాలను తీసుకువెళ్ళాలని నూజివీడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు పార్టీ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఉగాది నుంచి కూటమి ప్రచారం నూజివీడు నియోజకవర్గంలో ప్రారంభించాలన్నారు. గ్రామాల్లో కార్యక్రమాల నిర్వహణకు 3 పార్టీలతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసేందుకు పార్టీల నాయకులు సూత్రప్రాయంగా అంగీకరించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా తనిఖీ, ఇతర ప్రాంతాల్లో నివసించే ఓటర్ల గుర్తింపు, సామాజిక మాధ్యమాల్లో అభ్యర్థుల ప్రచారంతో పాటు టీడీపీ సూపర్ సిక్స్ పథకాల పై ఇంటింటి ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రతి మండలంలోనూ జయహో బీసీ సమావేశాలను నిర్వహించడంతో పాటు అన్ని వర్గాలను కలుపుకుని వెళ్ళేలా ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు నూతక్కి వేణుగోపాలరావు, పట్టణ అధ్యక్షులు జగదీష్, జనసేన సమన్వయకర్త ఫణిబా బు, జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి శివరామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జీవీఆర్‌కే రంగారావు, ఆముదాల ఇస్సాకు, మాగంటి వాసు తదితరులు పాల్గొన్నారు.

కలసికట్టుగా కూటమిని గెలిపించాలి : కామినేని

కైకలూరు: ఎన్డీయే కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా బీజేపీ నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని కైకలూరు బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం వరహాపట్నంలోని తన స్వగృహంలో నిర్వహించిన నియోజకవర్గ బీజేపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ దృష్ట్యా బీజేపీ నాయకులంతా జనసేన, టీడీపీ నాయకులతో కలసి పనిచేయాలని సూచించారు. బీజేపీ కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వేంపాటి విష్ణు, మాజీ అధ్యక్షుడు సుధాకర్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, 4 మండలాల అధ్యక్షులు కట్టా వీరరాఘవులు, నంబూరి నరసింహరాజు, సమయం ఏసుబాబు, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఐదేళ్లుగా వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు నష్టపోయారని మరలా వైసీపీకి ఓటు వేస్తే మరో 25 ఏళ్ల రాష్ట్రం వెనుకబడిపోతుందని ప్రజలంతా విజ్ఞతతో ఆలోచించి కూటమి అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎంపీపీ నర్సిపల్లి అప్పారావు అన్నారు. సోమవారం కైకలూరు 8వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపైన, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కైకలూరు మాజీ సర్పంచ్ తెంటు నాగేశ్వరరావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మండవల్లి: పుట్లచెరువులో సోమవారం కామినేని శ్రీనివాస్ తరపున కూటమి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పుట్లచెరువులో టీడీపీ మండవల్లి అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కామినేని బంధువులు కామినేని దీపిక, కామినేని తులసి, కామినేని సుజాత ఇంటింటికి తిరిగి కామినేనికి ఓటు వేయాలని, అలాగే టీడీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. అయ్యవారి రుద్రవరంలో కూటమి పార్టీల ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కలిదిండి: పెదలంక, వెంకటాపురం గ్రామాల్లో సోమవారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కురేళ్ల ఏడుకొండలు, వెంకటాపురం సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు, పెదలంక ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులు ఎం.భోగేశ్వరరావు, అక్కల బోసు, దున్న భోగేశ్వరరావు, దుగ్గిరాల పరమేశ్వరరావు, బీసీ సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్, బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి చక్రవర్తి, లంకా రత్నారావు పాల్గొన్నారు.

ముదినేపల్లి: అన్ని వర్గాల వారికి సమ న్యాయం జరగాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని అధికారంలోకి తేవాలని టీడీపీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ అన్నారు. ఏలూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, కైకలూరు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కామినేని శ్రీనివాస్ తరపున సోమవారం పేరూరు, బొమ్మినంపాడు గ్రామాల్లో పార్టీ నాయకులతో కలసి ప్రచారం నిర్వహించా రు. దాకరం, బొమ్మినంపాడు సర్పంచ్‌లు జాస్తి రాజా, దారం సుధ, పార్టీ నాయకులు పుట్టి రాజా, చల్లగుళ్ల ఆదిత్య, దావు నాగరాజు, బొంగు రవికుమార్, పుట్టి లక్ష్మణస్వామి, యర్రా రాంబాబు, కారుమూరి మురళీ తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ ధర్మాదాయ శాఖ

శ్రీ సీతారామ స్వామివారి దేవస్థానం, దిగవల్లి గ్రామం, నూజివీడు మండలం

C/o. శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి దేవస్థానము, అప్పనవీడు గ్రామం, హనుమాన్‌జంక్షన్, సెల్ : 91771 45150

టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన

ఏలూరు జిల్లా, నూజివీడు మండలం, దిగవల్లి గ్రామంలో నెలకొనియున్న శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానంకు చెందిన భూములను ఈ దిగువ తెలిపిన విధంగా మూడు (3) సంవత్సరములకు లీజునకు సేద్యము చేసుకొనుటకుగాను దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షములో టెండర్-కమ్-బహిరంగ వేలం పాట నిర్వహించబడును. కావున ఆసక్తి గల వారు ధరావతులు చెల్లించి పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

భూమి గల గ్రామము	సర్వే నెం.	విస్తీర్ణం & స్వభావం య.సెం.	ధరావత్తు సొమ్ము రూ.	లీజు కాల పరిమితి	వేలంపాట జరుపు తేదీ, సమయం & ప్రదేశం
దిగవల్లి గ్రామం నూజివీడు (మం)	336	6.16 (పల్లం)	10,000/-	2024-25 నుండి 2026-27 వరకు	ది. 20-04-2024 శనివారం 11 గంటలకు దేవాలయ ప్రాంగణం నందు
దిగవల్లి గ్రామం నూజివీడు (మం)	362	6.11 (పల్లం)	10,000/-	2024-25 నుండి 2026-27 వరకు	ది. 20-04-2024 శనివారం 11 గంటలకు దేవాలయ ప్రాంగణం నందు

పాట షరతులు : 1) ఈ వేలం G.O. Ms. No. 379, రెవెన్యూ (ఎండోమెంట్స్-1) డిపార్టుమెంట్, తేది. 11-03-2003 మరియు G.O.MS No. 425, రెవెన్యూ (ఎండోమెంట్స్-1) డిపార్టుమెంట్, తేది. 09-11-2015 ప్రకారం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఆమోదపు ఉత్తర్వులకు లోబడి సంస్థ కార్యనిర్వహణాధికారిచే నిర్వహించబడుచున్నది. ఈ పాట నందు హిందువులు మాత్రమే పాల్గొనవలెను. 2) టెండర్ దాఖలు చేయువారు తమ బిడ్ వివరములను సీల్డ్ కవరులో ఈ క్రింది తెలిపిన చిరునామాకు ది. 19-04-2024 సా. 5 గంటలలోగా పంపవలెను. ప్రతి పాటదారుడు నివాస ధృవీకరణ నిమిత్తం ఆధార్ లేక సంబంధిత ధృవీకరణ పత్రము తప్పక సమర్పించవలెను. 3) హెచ్చుపాటదారుడు పాట అయిన వెంటనే ఒక సంవత్సరము మక్తా సొమ్మును అడ్వాన్సుగా చెల్లించవలెను. ఈ సొమ్ము లీజు కాల పరిమితి పూర్తయిన తదుపరి ఇవ్వబడును. దీనికి వడ్డీ ఇవ్వబడదు.
మిగిలిన షరతులు పాట కాలమందు చదివి వినిపించబడును, ఇతర వివరములకు సంస్థ కార్యాలయము పనివేళలో సంప్రదించవలెను.

దిగవల్లి, ది. 08-04-2024 కార్యనిర్వహణాధికారి

ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలి: ఆర్‌వో భాస్కర్

కలిదిండి, ఏప్రిల్ 8 : ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలని కైకలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.భాస్కర్ అన్నారు. సోమవారం తాడినాడ, చినతాడినాడ, కొండూరు, కాళ్లపాలెం గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఓటర్లను ఎవరైనా భయభ్రాంతులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. కలిదిండి మండలంలో 63 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. బూత్‌లకు 200 మీటర్ల దూరంలో రాజకీయ పార్టీల ఆఫీసులు ఉండాలన్నారు. గ్రామాల్లో నూరు శాతం ఓట్లు పోలయ్యే విధంగా యువత సహకరించాలన్నారు. తహసీల్దార్ దశిక వంశీ, ఆర్‌ఐ విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ శేఖర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

జంగంగూడెం గ్రామ వలంటీర్ల రాజీనామా

నూజివీడు టౌన్, ఏప్రిల్ 8: నూజివీడు మండలం జంగంగూడెం గ్రామానికి చెందిన వలంటీర్లు సోమవారం తమ రాజీనామాలు నూజివీడు ఎంపీడీవో కిరణ్‌కుమార్‌కు సమర్పించారు. గ్రామానికి చెందిన 16 మంది వలంటీర్లు కోడ్ వచ్చిన నాటి నుంచి తమ వ్యక్తిగత వ్యవహారాలకు సైతం కొందరు అడ్డుతగులుతూ ఫిర్యాదులు చేస్తున్నారని, ఫలితంగా మనస్థాపానికి గురై బాధ్యతల నుంచి తప్పుకుంటున్నామని వారు ఎంపీడీవోకు తెలిపారు. అనంతరం నూజివీడు ఎమ్మెల్యే అప్పారావును కలిశారు.

జనసేనకు బీవీ రావు రాజీనామా

కైకలూరు, ఏప్రిల్ 8: కైకలూరు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బీవీ రావు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం కైకలూరులోని పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ పొత్తుల్లో భాగంగా కైకలూరు టిక్కెట్టును బీజేపీకి కేటాయించినా తమ పార్టీ నుంచి ఎలాంటి సందేశం తనకు రాలేదని, తాను కూడా టిక్కెట్టు ఆశించి రేసులో ఉన్నప్పటికీ తనకు ఎవరూ సమాధానం చెప్పలేదన్నారు. పవన్‌కల్యాణ్ సైతం చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారారని అందువల్లే రాజీనామా చేస్తున్నానని, మరో రెండు రోజుల్లో తన కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడించారు.

హోమియో ఆస్పత్రికి పెన్షనర్ల విరాళం

ఆగిరిపల్లి, ఏప్రిల్ 8: ఆగిరిపల్లిలో గల ప్రభుత్వ హోమియో ఔషధాలయం అభివృద్ధికి ఆగిరిపల్లి పెన్షనర్ల సంఘం సోమవారం రూ.10 వేలు విరాళంగా అందజేశారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని గ్రామస్థులు వైద్యశాల అభివృద్ధికి తోడ్పడాలని వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.రజిత కోరారు. ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా క్లాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పూర్తిస్థాయిలో నీటి విడుదల చేయాలి: ఎమ్మెల్యే

కైకలూరు, ఏప్రిల్ 8: కాలువలకు తాగునీటి విడుదలలో అధికారులు సర్పంచ్‌లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఆరోపించారు. సోమవారం ఆయన కైకలూరులో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో మంచినీటి చెరువులు నింపేందుకు ఏలూరు, కృష్ణాజిల్లా కలెక్టర్లు చొరవ తీసుకుని నీరు పూర్తిస్థాయిలో అందించాలన్నారు. కైకలూరు నియోజకవర్గంలో మంచినీటి చెరువులకు కాలువల వద్ద మోటార్లు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సర్పంచ్‌లను ఇబ్బంది పెడుతున్నారని, పూర్తిస్థాయిలో మంచినీటి చెరువులకు నీరు అందించేలా కృషి చేయాలన్నారు.



కైకలూరులో ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఐక్యత చాటుతున్న షరీఫ్, కామినేని

ఎన్డీయేతోనే ముస్లింల సంక్షేమం : షరీఫ్

కైకలూరు, ఏప్రిల్ 8: ముస్లింల సంక్షేమం, అభివృద్ధి ఎన్డీయే కూటమితోనే సాధ్యమని శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ అన్నారు. సోమవారం కైకలూరులో ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చాక దుల్హన్ పథకాన్ని నిర్వీర్యం చేశారన్నారు. కామినేని శ్రీనివాస్ కమలం గుర్తుకు ఓటు వేస్తే చంద్రబాబుకు వేసినట్లేనని అందరూ ఐక్యతతో కామినేనికి కమలం గుర్తుకు, ఎంపీ అభ్యర్థి పుట్ట మహేష్‌కుమార్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. గతంలో కామినేని శ్రీనివాస్ ఆరోగ్యశాఖమంత్రిగా ఉన్న సమయంలో ఫాతిమా కళాశాలకు గుర్తింపునిచ్చి 500 మంది పిల్లలు డాక్టర్లుగా తీర్చిదిద్దేందుకు ఎనలేని సేవలు అందించారన్నారు. రూ.12 కోట్లు ఫీజులను కూడా ప్రభుత్వమే చెల్లించే విధంగా ఆయన చొరవ చూపారని ఇలాంటి వ్యక్తి వల్ల ముస్లింల అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే కార్పొరేషన్ ద్వారా ముస్లింలకు రూ.10లక్షల వరకు రుణాలను అందజేస్తారని కులమతాల కతీతంగా కామినేనిని గెలిపించాలన్నారు. కామినేని మాట్లాడుతూ గతంలో 5 సంవత్సరాలు ఎమ్మెల్యేగా పనిచేశానని ఎన్నడూ ముస్లింల పట్ల వివక్షత చూపలేదని ఇప్పుడు కూడా అండగా ఉంటూ కైకలూరు నుంచి రౌడీలను పారదోలి ప్రజలు స్వేచ్ఛగా జీవించేలా కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కెఎల్ డెంటల్ కళాశాల చైర్మన్ కెఎల్ రసూల్, మాజీ వైస్ ఎంపీపీ ఎంఎ రహీం, కైకలూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎండీ జానీ, టీడీపీ నాయకులు ఎండీ ఉస్మాన్, సయ్యద్ బాషీద్, మాజీ జడ్పీటీసీ బొమ్మనబోయిన విజయలక్ష్మీ, మండల పార్టీ అధ్యక్షులు పెన్మెత్స త్రినాథరాజు, పార్టీ నేతలు తాడినాడ బాబు, పోలవరపు లక్ష్మీరాణి, జనసేన మహిళ తోట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వల కార్మికుల జీవనోపాధికి కృషి : కామినేని

కొల్లేరు ప్రజల జీవనోపాధికి ఎన్డీయే కూటమి విశేష కృషి చేస్తుందని కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం కైకలూరులో కొల్లేరులో జీవనోపాధి కోసం చేపలు, రొయ్యల పట్టుబడులకు వెళుతున్న కార్మికుల ఆత్మీయ సమావేశాన్ని టీడీపీ రాష్ట్ర వడ్డి సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. కామినేని మాట్లాడుతూ కొల్లేరుకు శాశ్వత పరిష్కారం ద్వారా అందరికి జీవనోపాధి లభిస్తుందని, రాష్ట్రంలో టీడీపీ, దేశంలో బీజేపీని అధికారంలోకి తీసుకువస్తే కొల్లేరు సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. నిత్యం పొట్టకూటి కోసం వలలు పట్టుకుని వ్యానుల్లోనూ, బైక్‌లపైన దూరప్రాంతాలకు వెళ్లి పట్టుబడులు చేస్తున్న కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ పట్టుబడులకు వెళ్లి వచ్చే సమయాల్లో అనేకమంది కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారని వీరిని ఆదుకునేందుకు గతంలో తెలుగుదేశం ప్రభుత్వం రూ.5 లక్షలు మృతి చెందిన కుటుంబాలకు ప్రమాద బీమాను అందించేవారని మరలా టీడీపీ అధికారంలోకి వస్తే రూ.10 లక్షలు ప్రమాద బీమా చెల్లిస్తారన్నారు. కార్మికులంతా సంఘటితంగా సంక్షేమ బోర్డును ఏర్పాటుచేసుకుంటే చట్టసభల్లో దీనికి భద్రత కల్పించి కావాల్సిన అన్నిరకాల సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, టీడీపీ నేత పిన్నమనేని బాబ్జి, కేశవరాజు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడులో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ధర్నా -9లో

• ఉగాది వేడుకలో..

నేడు ఉగాది. ఈ రోజు నుంచి శ్రీ క్రోది నామ సంవత్సరం ప్రారంభం. తీపి, చేదు, పులుపు, వగరు, కారం, ఉప్పుల షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడి. ఈ పచ్చడి మాదిరే జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలు, బాధ, సంతోషాలను సమపాళ్లల్లో తీసుకోవాలని చెప్పేదే.. ఈ పండుగ పరమార్థం. పండుగకు మేం సిద్ధం అంటూ పెనుగొండ భాష్యం స్కూల్ చిన్నారులు వేప పువ్వు, మామిడి కాయలు కోస్తూ ఇలా కనిపించారు. సోమవారం ఏలూరు సహా మిగిలిన మార్కెట్‌లన్నీ కళకళలాడాయి.



విస్తృత తనిఖీలు

▸▸ రూ.22 లక్షల నగదు..16 కేజీల బంగారం, 31 కేజీల వెండి పట్టివేత : ఎస్పీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 8 : సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా రూ.37 వేల విలువైన 11.40 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు తనిఖీల్లో నగదు 22 లక్షల 18 వేల 600 రూపాయలు, 16 కేజీల 258 గ్రాముల బంగారం, 31 కేజీల 42 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు.

(ప్రధాన వార్త మెయిన్‌లో)

ముగిసిన 'పది' మూల్యాంకనం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 8 : ఈనెల ఒకటో తేదీ నుంచి ఏలూరు సెయింట్ గ్జేవియర్ హైస్కూలు క్యాంపులో జరుగుతున్న పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం ముగిసింది. మొత్తం రెండు లక్షల జవాబు పత్రాల మూల్యాంకనానికి 1200 మంది టీచర్ల సేవలను వినియోగించుకున్నారు. ఈనెల 13 నుంచి దూరవిద్య ఇంటర్మీడియట్ మూల్యాంకనం ప్రారంభం కానుంది. ఏడువేల ఆన్సర్ స్క్రిప్టులు అందగా, 80 మంది పీజీటీలు, జూనియర్ లెక్చరర్లను నియమించారు.

సమర్ధవంతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలి : ఐజీ



సదస్సులో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 8: పోలీసు అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా, సమర్ధవంతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసు అధికారులు, సాయుధ దళాల అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని సమస్యాత్మక అతి సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచాలన్నారు. ప్రజలు వారి ఓటు హక్కును స్వేచ్ఛగా నిర్వహించుకునేవిధంగా భరోసా కల్పించాలన్నారు. ప్రతి రోజు పోలీస్ స్టేషన్ల పరిధిలో గ్రామాలలో ఫ్లాగ్‌మార్చ్‌లు, ఫుట్‌పెట్రోలింగ్, వాహన తనిఖీ నిర్వహించాలన్నారు. జిల్లాలో తీసుకున్న చర్యలను ఎస్పీ మేరీ ప్రశాంతిని అడిగి తెలుసుకున్నారు. ఏఎస్పీ స్వరూపరాణి, ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు డీఎస్పీలు పాల్గొన్నారు.

నీరు అక్రమ వినియోగంపై ప్రత్యేక బృందాలతో నిఘా : కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, ఏప్రిల్ 8: వేసవిలో తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీరు అక్రమ వినియోగాన్ని నిరోధించేందుకు జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయి బృందాలను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేశ్ వివరించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, తదితర అంశాలపై సోమవారం కలెక్టర్లతో రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్. జవహర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఏలూరు నుంచి కలెక్టర్ వై.ప్రసన్నవెంకటేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సత్యనారాయణ, జడ్పీ సీఈవో కేఎస్ఎస్.సుబ్బారావు, ఎస్‌ఈ సాల్మన్‌రాజు, డ్వామా పీడీ ఎ.రాము, డీపీవో తూతిక శ్రీనివాసవిశ్వనాథ్ హాజరయ్యారు. ఈనెల 17లోపు చెరువులు నింపేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.

కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్

ఏలూరుసిటీ, ఏప్రిల్ 8: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్ కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు. ఎన్నికల సమాచారాన్ని అందరికీ తెలియజేయడం, నిబంధనలను అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకోవడం కోసం కమాండ్ కంట్రోల్ రూమ్ పని చేస్తుంది. దీనిలో సుమారు తొమ్మిది విభాగాలున్నాయి.

ఈవీఎంల భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన


స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

చింతలపూడి, ఏప్రిల్ 8: చింతలపూడి నియోజకవర్గంలో పోలింగ్‌కు ఉపయోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ల భద్రత కోసం తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ కోసం ఏఎంసీ గోడౌన్‌ను అధికారులు పరిశీలించారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య, డీఎస్పీ రవిచంద్ర సోమవారం పరిశీలించారు. ఈవీఎంలు త్వరలో రానున్నాయని, మార్కెట్‌యార్డులోని గోడౌన్-1 పరిశీలించినట్లు వారు తెలిపారు. సీఐ సుధాకర్, ఎన్నికల సహాయ అధికారి గోపాలకృష్ణ, ఎస్సై కుటుంబరావు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి : సూర్యతేజ


తహసీల్దార్లతో మాట్లాడుతున్న సూర్యతేజ

బుట్టాయగూడెం, ఏప్రిల్ 8: ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీవో, పోలవరం ఎస్టీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ తహసీల్దార్లకు స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని తహసీల్దార్లతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారులు, చెక్ పోస్టుల అధికారులు నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలన్నారు. డబ్బు, మద్యం తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. సి విజిల్ ద్వారా వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

గట్టుతో సమాంతరంగా ఏలూరు కాల్వ

కైకరం వద్ద గండి భయంలో ఆయకట్టు రైతులు


కైకరం వద్ద గట్టుపై చేరిన కాల్వ నీరు

ఉంగుటూరు, ఏప్రిల్ 8: కైకరం వద్ద వియర్ ఛానెల్ సమీపంలో ఏలూరు కాల్వ గట్టుకు సమాంతరంగా ప్రవహిస్తోంది. గట్టు గండి పడుతుందని స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు. కాల్వ గట్టు కింద సుమారు 80 ఎకరాల్లో వరి పంటకు ముంపు పొంచి ఉందని రైతులు చెబుతున్నారు. గుండుగొలను పరిధిలో చేలకు సాగునీటి కోసం కాల్వకు నీటి విడుదల పెంచడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ముంపు ప్రమాదంపై రైతులు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. కైకరం వద్ద కాల్వ రేవు నిర్మాణం కోసం పూడిక, కర్ర నాచు, గుర్రపు డెక్క ప్రవాహానికి అడ్డంకిగా మారింది. ముంపు పరిస్థితిపై ఆందోళన చెందిన రైతులు ఏలూరు ఆర్డీవో ఖాజావలి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. ఈ మేరకు సాయంత్రానికి నీటి మట్టాన్ని తగ్గించామని, ప్రమాదకర పరిస్థితి లేదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. గట్టు మెరక చేసేందు కు అంచనాలు రూపొందించి పంపామని నిధులు మంజూరు కాలేదన్నారు. ప్రమాదకరంగా మారిన గట్టు ప్రాంతాన్ని తాడేపల్లిగూడెం మేజర్ ఇరిగేషన్ ఏఈ మడిచర్ల వీర వెంకట పెద్దిరాజు వీఆర్వో భీమవరపు నాగేశ్వరరావు పరిశీలించి తాత్కాలికంగా గట్టును పటిష్టం చేయించారు.


చింతలపూడిలో ఇఫ్తార్ విందులో రోషన్‌కుమార్


పోలసానిపల్లిలో ధర్మరాజుకు మహిళల హారతి


కొయ్యలగూడెం ర్యాలీలో మాట్లాడుతున్న బాలరాజు


జీలుగుమిల్లిలో జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణుల ర్యాలీ

రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన

అంతం చేయాలి

టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు, నేతల పిలుపు


ఏలూరులో బస్సు ప్రయాణికులతో పుట్టా మహేష్, బడేటి చంటి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 8: రాష్ట్రంలో జగన్ అరాచక పాలన పారదోలేందుకు ప్రజలంతా సమయత్తం కావాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ఏలూరు ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం బస్సు ప్రయాణికులను కలిసి సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. కూటమి అధికారంలోకి వస్తే మహిళలందరికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేస్తామని అన్నారు. మహిళల సంక్షేమానికి పెద్ద పీట వేస్తామన్నారు. సొంత చెల్లెల్లికి న్యాయం చేయ్యని జగన్‌ను నమ్మితే మరోసారి మోసపోవాల్సి వస్తుందన్నారు.

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే రూ.7వేలు పింఛన్ అందజేస్తామని ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. 39వ డివిజన్‌లో ప్రజాగళం పాదయాత్ర నిర్వహించారు. ఈ నెల నుంచి రూ.4వేలు పింఛన్ ఇస్తామన్నారు. కూటమి ప్రభుత్వం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాశీనరేష్, శివప్రసాద్, మాజీ మంత్రి రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ గౌడ సంఘ నేతలతో సమావేశమయ్యారు. గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శ్యామ్‌చంద్రశేషు ఎంపీ కార్యాలయంలో భేటీ అయ్యారు. మహేష్ మాట్లాడుతూ బీసీల సమస్యలను పార్లమెంట్‌లో వినిపించడానికి తనకు మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణగౌడ్, సీహెచ్ రామలింగేశ్వరరావు, మహేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపుకోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు : గన్ని

భీమడోలు: జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి గెలుపుకోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. పోలసానపల్లిలో జనసేన, టీడీపీ, బీజేపీల ఎన్నికల ప్రచారం నిర్వహించింది. జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ జగన్‌రెడ్డి పార్టీని భూ స్థాపితం చేసి రాష్ట్రం అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని పార్టీ శ్రేణులను కోరారు. గన్ని నాగగోపాలరావు, నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో సంపద సృష్టించి ప్రజల ఆదాయాన్ని పెంచడానికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి గన్ని వీరాంజనేయులు అన్నారు. గన్ని క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● గణపవరం: ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించాలని ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు సోదరుడు భీమరాజు కోరారు. ఎ.గోపవరంలో ఇంటింటా పర్యటించి గ్లాస్ గుర్తుకు ఓటు వేసి ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కానుమిల్లి చంటి, ఏడిద వాసు, అల్లూరి బదిరి నారాయణ, భీమవరపు ఏసురాజు, పల్లి వెంకటేశ్వరరావు, తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీతోనే మైనార్టీల సంక్షేమం : మహేష్ యాదవ్

పెదపాడు: మైనార్టీల సంక్షేమానికి, అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ చిత్త శుద్ధితో కృషి చేస్తుందని, మైనార్టీలంతా తెలుగుదేశం పార్టీకి అండగా నిలవాల్సిన అవసరముందని టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్ట మహేష్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సతీమణి రాధారాణి అన్నారు. అప్పనవీడు మసీదులో జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. మతపెద్దలు వారికి స్వాగతం పలికారు. ప్రార్థనల అనంతరం వారితో కలిసి ఇఫ్తార్ విందు స్వీకరించారు. జనసేన నాయకురాలు ఘంటశాల వెంకటలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు, ముస్లింలు పాల్గొన్నారు.

కొత్త ఏడాదిలో సైకో పాలన నుంచి విముక్తి : చింతమనేని

పెదవేగి: ఎన్డీఏ కూటమితో టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, ఆపై అంతా శుభమే జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే చింత మనేని ప్రభాకర్ అన్నారు. కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు సైకో పాలన నుంచి విముక్తి లభిస్తుందన్నారు. శ్రీక్రోధి నామ ఉగాది సంవత్సరం ఆగమనం సందర్భంగా సోమవారం ఆయన ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, ఉగాదితో రాక్షస పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించి, స్వేచ్ఛాయుత జీవితాన్ని గడుపుతారని అన్నారు. ప్రజా వ్యతిరేక పాలన సాగించిన వైసీపీకి మరో నెలరోజులు మాత్రమే సమయం ఉందని, వచ్చే ఎన్నికల్లో నిరంకుశ జగన్‌రెడ్డికి ఓటు ద్వారా బుద్ధి చెప్పడానికి జనం సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్డీఏ కూటమి విజయంతో తిరిగి ప్రజాపాలన వస్తుందన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు సంక్షేమం ఇంటికి చేరుతుందన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి లేదు : రోషన్‌కుమార్

చింతలపూడి: వైసీపీ పాలనలో అభివృద్ధిలేదని కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక షాదిఖానాలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సంక్షేమం పేరుతో వైసీపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు వల్లే రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, చింతలపూడి ఎత్తిపోతల పతకాలు పూర్తవుతాయని సంక్షేమ కొనసాగిస్తూ ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలసత్తా ఆయనకే ఉందన్నారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. చింతలపూడి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. అనంతరం మసీదులో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు ముత్తారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అట్లూరి శ్రీనివాసరావు, చిట్లూరి ధర్మరాజు, జనసేన నాయకులు మధుబాబు, విజయ్‌కుమార్, ముస్లిం కమిటీ పెద్దలు సయ్యద్‌బాబు, జిలానీ, అక్బర్‌ఆలీ, తదితరులు పాల్గొన్నారు.

చిర్రి బాలరాజు భారీ ర్యాలీ

కొయ్యలగూడెం / జీలుగుమిల్లి: జనసేన, బీజేపీ, టీడీపీ కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహిం చారు. జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురంలో ప్రారంభమైన ర్యాలీ బుట్టాయగూడెం, కొయ్యలగూడెం మండలం కన్నాపురం, దిప్పకాయలపాడు, అంకాలగూడెం, కొయ్యలగూడెం వరకు కొనసాగింది. ర్యాలీలో జనసేన, టీడీపీ బీజేపీ నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. మోటార్ సైకిళ్లు, కార్లతో భారీ ర్యాలీ కొనసాగింది. నాయకులు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ర్యాలీలో కరాటం సాయిబాబు, గడ్డమణుకు రవికుమార్, గంగిరెడ్ల మేఘలాదేవి, దుగ్గిన శ్రీను, తోట రవి, పసుపులేటి రాము, అక్కిశెట్టి బలరాం, బుడిపుటి చిరంజీవి, ఏడు మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ద్వారా ప్రజల కష్టాలు తీరతాయి. రాబోయే ఎన్నికల్లో కూటమిని గెలిపిస్తే ప్రజల కష్టాలు తీరుతాయని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మేఘలాదేవి అన్నారు. గవరవరంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల క్షేత్ర పరిశీలన


నడిపల్లి గ్రామ నమూనా పరిశీలిస్తున్న విద్యార్థులు

పెదవేగి, ఏప్రిల్ 8: మార్కాపురం ఎన్ఎస్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు నడిపల్లిలో సోమవారం క్షేత్రపరిశీలన చేశారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఎన్ఎస్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఏడుగురు నడిపల్లి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి, పంటల యాజమాన్యం, గ్రామీణ వాతావరణం, పని అనుభవం, రైతుల అనుభవాలను తెలుసుకున్నారు. ఏలూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త కె.ఫణికుమార్ మాట్లాడుతూ గ్రామీణ విశ్లేషణాత్మకతను కలిగి ఉంటే విద్యార్థులు భవిష్యత్‌లో మంచి శాస్త్రవేత్తలుగా ఎదుగుతారన్నారు. విద్యార్థులు నడిపల్లి గ్రామ పటం నమూనా పరిశీలించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎన్.నాగేంద్రబాబు, లహరి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణం తరలించాలి

ఏలూరు కలెక్టరేట్, ఏప్రిల్ 8: పత్తేబాద నుంచి అశోక్‌నగర్ మార్గంలో ప్రభుత్వ మద్యం దుకాణం వేరొక చోటికి తరలించాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షకార్యదర్శులు వి.శ్యామల, మన్నవ యామిని డిమాండ్ చేశారు. సోమవారం డీఆర్వోను కలసి వినతిపత్రం అందించిన అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. నివాస ప్రాంతం ఇరుకురోడ్డులో మద్యం దుకాణంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు. ఆ ప్రాంతంలో సుమారు 400మంది మహిళలు పనులు చేసుకుంటున్నారని, వారు తిరిగి ఇంటికి వెళ్లే కొందరు మద్యం మత్తులో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారన్నారు. మద్యం సీసాలు ఇళ్ల మధ్యనే పడేస్తున్నారని, ప్రశ్నించిన మహిళలపై దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం మద్యం దుకాణం తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు భాగ్యలక్ష్మి, కోహిమ తదితరులు పాల్గొన్నారు.

సీ విజిల్ వినియోగంపై కళా ప్రదర్శనతో అవగాహన



కళాకారులతో అవగాహన కార్యక్రమం

పెదపాడు, ఏప్రిల్ 8: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, 18ఏళ్ల వయసు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని వీరమ్మకుంట గ్రామ కార్యదర్శి దుంపల ఉమాభరత్ తెలిపారు. సీ-విజిల్ యాప్ వినియోగం, ఓటింగ్ శాతం పెంచడం, ఎథికల్ ఓటింగ్‌పై గ్రామ ప్రజలకు కళాకారులతో కళాజాత ప్రదర్శన సోమవారం జరిగింది. డబ్బు, మద్యానికి, బహుమతులకు లోగకుండా బాధ్యతాయుతంగా ఓటింగ్‌లో పాల్గొవాలని ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కళాకారులు శివరామకృష్ణ, శాంతిప్రియా తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రవి

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 8: పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం తెల్లం రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. రవి మాట్లాడుతూ ఎన్నికలలో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ మతతత్వ పాలనతో ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. మళ్లీ అధికారం కోసం బీజేపీ కుట్రలు చేస్తున్నదని, తనకు అనుకూలంగా లేని పార్టీలపై ఈడితో దాడులు చేయించి అక్రమ అరెస్టులు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాంతంలోని నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో రెండు ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని, వైసీపీ అభ్యర్థులను ఓడించాలని, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక వాదాన్ని రక్షించే వారికే ఓటు వేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు వై.నాగేంద్రరావు, ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ, జి.వెంకట్రావు, తామా ముత్యాలమ్మ, టి.దుర్గారావు, ఎం.దుర్గారావు, ఎస్.రాంబాబు, పి.సూర్యారావు పాల్గొన్నారు.

గ్రామాలలో సాయుధ దళాల కవాతు


గోపీనాథపట్నంలో సాయుధ బలగాల కవాతు

ఉంగుటూరు, ఏప్రిల్ 8: ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని చేబ్రోలు ఎస్ఐ మణి కుమార్ కోరారు. దీని నిమిత్తం ప్రజలలో ఎటువంటి ఆందోళన చెందకుండా ఉండేందుకు సాయుధ బలగాలతో కవాతు సోమవారం నిర్వహించారు. మండలంలోని గోపీనాథపట్నం, గొల్లగూడెం, ఎర్రమిల్లిపాడు, నల్లమాడు, క్వారీ గోపాలపురం, పందిరెడ్డిగూడెం గ్రామాలలో కవాతు నిర్వహించారు. నిడమర్రు సర్కిల్ పరిధిలోని చేబ్రోలు ఎస్ఐ ఎ.మణికుమార్, ఏఎస్ఐ కె.సాంబశివరావు ఆధ్వర్యంలో సాయుధ పోలీసులు కవాతు నిర్వహించారు.

టీడీపీకి అండగా ఉండాలి : నాయీబ్రాహ్మణ సంఘం


మాట్లాడుతున్న నాయీ బ్రాహ్మణ నాయకులు

లింగపాలెం, ఏప్రిల్ 8: మండలంలో నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ప్రచారం నిర్వహించారు. లింగపాలెం, భోగోలు, యడవల్లి గ్రామాల్లో నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు కొప్పెర్ల నాగరాజు అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమిని గెలిపించుకోవాలని కోరారు. జగన్ ప్రభుత్వం వచ్చాక నాయీ బ్రాహ్మణులకు అనేక సంక్షేమ పథకాలు ఎత్తివేశాడన్నారు. సబ్సిడీపై తమకు కుల వృత్తి నిర్వహించే పనిముట్లు ఇవ్వకుండా ఆపివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీకి నాయీ బ్రాహ్మణులంతా అండగా ఉండాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్ ఎత్తివేసి తమకు చెందాల్సిన నిధులను దారిమళ్ళించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులు కొప్పాక వీరవెంకటసత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి ఆచంట శ్రీనివాస్, నరం సత్యనారాయణ, నందిగం వెంకటసుబ్బారావు, మల్లికార్జున్‌రావు, నాగరాజు, పలువురు నాయిబ్రాహ్మణ సోదరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 8: ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇండియా కూటమి అభ్యర్థి బండి వెంకటేశ్వరరావును గెలిపించాలని సీపీఐ జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన విలేఖర్ల సమావేశంలో వనజ మాట్లాడుతూ ఇండియా కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కారం రాఘవ

బుట్టాయగూడెం, ఏప్రిల్ 8: పశ్చిమ ఏజెన్సీలో ప్రాంతంలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఏపీకేఎంఎస్ జిల్లా నాయకుడు కారం రాఘవ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వెలుతురువారిగూడెంలో ప్రజా సమస్యలపై జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర విభజన నుంచి నేటివరకు ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాల రోడ్లు నిర్లక్ష్యానికి గురవుతున్నాయన్నారు. పోలవరం నియోజకవర్గంలో మెజారిటీ మండలాలు షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్నాయని ఇక్కడ భూములు అమ్మడం కొనడం నిషేధం అన్నారు. 1/70 చట్టం పరిధిలో గిరిజనేతరులు అక్రమంగా భూములు కలిగి ఉన్నారని అటువంటి భూములను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నోటీసులు ఇచ్చి స్వాధీనం చేసుకుని గిరిజనులకు పంచాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ తరపున పోలవరం అసెంబ్లీకి పోటీచేస్తున్న సరియం రామ్మోహన్‌ను పరిచయం చేశారు. కార్యక్రమంలో నాయకులు టి.బాబురావు, జి.రమేష్, ఈ.భూషణం, బి.వినోద్, కె.సంకురు, భాషా రంపాలరాజు, వీర్రాజు, సిరమయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు : ఆర్డీవో


అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న ఆర్డీవో

లింగపాలెం, ఏప్రిల్ 8: ధర్మాజిగూడెం నల్ల సముద్రం చెరువులో అక్రమ తవ్వకాలపై సమాచారం అందుకున్న నూజివీడు ఆర్డీవో వై.భవానిశంకరి సోమవారం పరిశీలించారు. మట్టి తవ్విన ఆనవాళ్లు గుర్తించి అధికారులను హెచ్చరించారు. తవ్వకాలను అడ్డుకోవాలని సూచించారు. అక్రమంగా ఎవరైనా మట్టితవ్వకాలు జరిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆమె ధర్మాజీగూడెంలోని ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఆమెతో పాటు తహసీల్దార్ ప్రసాద్, ఎస్సై చెన్నారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలు అడ్డుకున్నరైతులు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 8: కొందరు వైసీపీ నాయకులు రాత్రి, పగలు తేడా లేకుండా చెరువుల్లో మట్టిని కొల్లగొడుతూ సొమ్ములు దండుకుంటున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకుండా ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. మండలంలోని సూర్యచంద్రరావుపేట శివారులో ఉన్న కృష్ణాపురం చెరువులో ఆదివారం అర్ధరాత్రి జరుగుతున్న అక్రమ తవ్వకాలను రైతులు అడ్డుకుని జేసీబీ, టిప్పర్లను వీఆర్వో నాగరాజుకు అప్పగించారు. ఐదేళ్లుగా ఈ చెరువును కొందరు అధికార పార్టీ నేతలు తవ్వుతున్నారని ఇష్టానుసారంగా మట్టిని అక్రమంగా తరలించి అమ్ముకుంటున్నారని చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. టిప్పర్ మట్టిని రూ.10 వేల వరకూ విక్రయిస్తున్నారని చెబుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికి అధికారాన్ని అడ్డుపెట్టుకుని బరి తెగిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

పాఠశాలల్లో నాడు నేడు పనుల పరిశీలన

కుక్కునూరు, ఏప్రిల్ 8: పాఠశాలల్లో నాడు-నేడు పనులను సోమవారం సెక్టోరియల్ అధికారి జీసీడీవో సభిహ సుల్తానా, సెక్టోరల్ అధికారి రమేష్ పరిశీలించారు. వేలేరు, కుక్కునూరు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, కమ్మరిగూడెం, కుక్కునూరు ఆశ్రమ పాఠశాలల్లో పనులను పరిశీలించారు. అనంతరం హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు.

వైఎంహెచ్ఏలో ఘంటసాల గానవినోదం


రమాదేవికి బిరుదు ప్రదానం చేస్తున్న అతిథులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 8: మహా గాయకుడు ఘంటసాలది అమృత స్వరమని పలువురు వక్తలు అన్నారు. వైఎంహెచ్ఏ హాల్‌లో ఘంటసాల స్వరపీఠం సంస్థ ఆధ్వర్యంలో శ్రీక్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఘంటసాల గానవినోదం ఘనంగా నిర్వహించారు. పలువురు వక్తలు ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పించారు. ఘంటసాల గానంలో ప్రతిఅక్షరం, ప్రతిపాట కొత్తదనాన్ని సంతరించుకుని శతాబ్ది గాయకుడిగా ఘంటసాల స్వరం ప్రవాహం తెలుగువారి హృదయాల్లో జీవనదిగా ప్రవహిస్తూనే ఉంటుందని కొనియాడారు. భగవద్గీతను ఘంటసాల గొంతులో వినగలగటం తెలుగువారికి భగవంతుని వరప్రసాదమన్నారు. అనంతరం ప్రముఖ గాయని హైదరాబాద్ ఘంటసాల సంగీత కళాశాల మాజీ ప్రిన్సిపాల్ వేటూరి రమాదేవికి గాన తరంగిణి బిరుదు ప్రదానం చేశారు. అర్జున్‌రావు, లంకా వెంకటేశ్వర్లు, సూర్యప్రకాష్, వహీదావాసు, డీకే.బిందు, ఎస్‌కే.సుభానీ తదితరులు ఘంటసాల గీతాలను ఆలపించారు. ఘంటసాల స్వరపీఠం వ్యవస్థాపక కార్యదర్శి ఎస్ఎం సుభానీ అధ్యక్షత వహించారు. పీఠం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు, ఎ.వీరభద్రరావు, జి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఉగాది సందడి


సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు

పెదపాడు, ఏప్రిల్ 8: వట్లూరు సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. సంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థులు తెలుగు సంవత్సరాది ఉగాదికి స్వాగతం పలుకుతూ భరతనాట్యం, కోలాట ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. నరసింహశాస్త్రి పంచాంగ శ్రవణం అనంతరం ఉగాది పచ్చడి, ప్రసాదాలను అందజేశారు. రామకృష్ణంరాజు, వెంకటేశ్వరరావు, వెంకట శ్రీధర్, సతీష్, సుష్మ, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరు జూట్‌మిల్ మూసివేయడం సరికాదు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 8: కొత్తూరు జ్యూట్‌మిల్లును మూసివేయడం సరికాదని ఏపీ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు ఖండించారు. వందలాదిమంది కార్మికులు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఇప్పటికే ఏలూరు జ్యూట్‌మిల్లును మూసివేశారని, ఇప్పుడు కొత్తూరు జ్యూట్‌మిల్లును మూసివేసి కార్మికులను బజారున పడవేయడం సరికాదన్నారు. ప్రభుత్వం మిల్లును నడిపి కార్మికులకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ఆళ్లనాని కలుగజేసుకుని కొత్తూరు జ్యూట్‌మిల్లు తెరిచే ప్రయత్నం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈదురు గాలులకు కూలిన చెట్టు

పోలవరం, ఏప్రిల్ 8: స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద సోమవారం ఉదయం ఈదురు గాలులకు రావి చెట్టు కూలి విద్యుత్ లైన్లపై పడింది. విద్యుత్ శాఖ అధికారులు సరఫరా నిలిపివేశారు. విద్యుత్ శాఖ ఏఈ కొండా సత్యనారాయణను మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో చెట్టు కూలిందని, ఆలయ నిర్వహకులు చెట్టు తొలగిస్తే విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. సాయంత్రానికి చెట్టుని తొలగించడంతో అధికారులు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** కొత్తపేట గ్రామదేవత నూకాలమ్మ ఆలయం వద్ద సోమవారం జాతర ఘనంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు కుటుంబ సమేతంగా అ మ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారిని ఊరేగించారు.
- **కామవరపుకోట :** ఆడమిల్లి మందా సమేత శనీశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి తైలాభిషేకాలు, అభిషేకాలు జరిపారు. దోషనివారణకు ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.
- **పోలవరం :** వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఇటీవల నూతనంగా ప్రతిష్టించిన శ్రీచక్ర సహిత నగరేశ్వర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద పండితులు పైడిపల్లి ఫణికుమార్ శర్మ, పైడిపల్లి సుబ్బారావు, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి మద్దు పోశీ నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.
- **ఏలూరు ఎడ్యుకేషన్ :** వేసవిలో గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు హెచ్చరించారు. నగరంలోని జేపీ కాలనీ అర్బన్ పీహెచ్‌సీలో గర్భిణులకు సూచనలు ఇచ్చారు. ఎండలో ఎక్కువదూరం ప్రయాణించేయవద్దని, కొబ్బరి బొండాల నీరు, గ్లూకోజ్‌వాటర్, ఓఆర్ఎస్ ద్రావణం తరచుగా తీసుకోవాలన్నారు.
- **ఏలూరు టూటౌన్ :** జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులపై వేదింపులు ఆపాలని అవాస్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖరీముల్లా డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉద్యోగుల పై ఆ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు వేధింపులకు గురి చేస్తున్నాడని అన్నారు. జిల్లా కలెక్టర్ విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

లోగ్రేడ్ పొగాకుకు మంచి ధర

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 8 : వర్జీనియా పరిధిలో లోగ్రేడ్ పొగాకుకు మంచి ధరలు వస్తున్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ తెలిపారు. సోమవారం జంగారెడ్డిగూడెం వేలం కేంద్రంలో జరిగిన బోర్డు అధికారులు, రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం లోగ్రేడ్ పొగాకుకు మంచి ధర పలుకుతోందని, నెంబరు పొగాకుకు ధర పెరిగితే లోగ్రేడ్ ధర తగ్గిపోయే ప్రమాదం ఉందని దీనిని గమనించి రైతులందరూ మార్కెట్‌లో ధర పలికే బేళ్లను ప్రతీ రోజు1000కి తగ్గకుండా అమ్ముకోవాలని సూచించారు. సైక్లోన్ వల్ల తోటలు దెబ్బతిని ఎక్కువగా లోగ్రేడ్ వచ్చిందని, ఉన్న కొద్దిపాటి నంబర్ పొగాకుకు కేజీకి రూ.300 కనీసం రాకపోతే భారీగా నష్టపో తామని, సైక్లోన్ కారణంగా దిగుబడులు ఎకరాకు 3-4 క్వింటాలు తగ్గిపోయిందని మంచి ధరలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబు, రీజనల్ మేనజర్ ఆదిశేషయ్య, రైతు నాయకులు గద్దే లక్ష్మణరావు, గద్దే రాజేంద్ర ప్రసాద్, వామిశెట్టి హరిబాబు, ఘంటసాల గాంధీ, సత్రం వెంకటరావు, అట్లూరి సతీష్, గడ్డమనుగు సత్యనారాయణ, పిన్నమనేని రాధాకృష్ణ పాల్గొన్నారు. కొయ్యలగూడెం పొగాకు వేలం కేంద్రాన్ని యశ్వంత్‌కుమార్ పరిశీలించారు. వేలాన్ని పరిశీలించి రైతులకు, అధికారులకు తగు సూచనలు చేశారు.

విర్డ్ ఆసుపత్రిలో చారిటబుల్ ఆర్థోపెడిక్ క్యాంపు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 8: విర్డ్ ఆసుపత్రిలో ఈనెల 21 నుంచి 24 వరకూ డాక్టర్ శ్రీనాథ్ కామినేని (యుఎస్‌ఏ) వారిచే చారిటబుల్ ఆర్థోపెడిక్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్‌వీ సుధాకరావు తెలిపారు. భుజం, మోచేయి, తుంటి,మోకాలు సమస్యలున్నవారికి అత్యాధునిక వైద్యం అందించేందుకు యుఎస్‌ఏ నుంచి కూడా వైద్యులు శస్త్ర చికిత్సలు చేసేందుకు వస్తారని వివరించారు.వైద్య ఖర్చులు భరించలేని వారికి స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలతో భాగస్వామ్యులుగా కలిసి పనిచేస్తున్నాయన్నారు. సమస్యలున్న వారు స్క్రీనింగ్, చికిత్స కోసం పాత రిపోర్ట్స్ తెచ్చి రిజిస్టర్ చేయించుకోవాన్నారు. 83744 45108 నంబరును సంప్రదించాలని కోరారు.

రియల్‌టైం సాఫ్ట్‌వేర్‌ల అభివృద్ధికి కృషి చేయాలి


అనిల్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఆచార్యులు

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 8 : విద్యార్థులు రియల్ టైం సాఫ్ట్‌వేర్‌ల అభివృద్ధి కోసం కృషి చేయాలని భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ జీ.అనీల్‌కుమార్ సూచించారు. ఏపీ నిట్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం సహకారంతో మాట్లాబ్-సిమ్యులింక్ అనే అంశంపై విద్యార్థులకు సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనీల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు నాణ్యమైన, ఉన్నతమైన ఆలోచనలు చేస్తూ విభిన్న పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. మాట్లాబ్-సిమ్యులింక్ బేసిక్స్, పనిచేసే విధానం, ఎలా నిర్మించాలి తదితర అంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం అనీల్‌కుమార్‌ను శాలువా, జ్ఞాపికలతో ఆచార్యులు, విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమానికి కన్వీనర్‌గా డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ వీరేష్‌కుమార్ వ్యవహరించగా, రీసెర్చ్ కన్సల్టెన్సీ డీన్ డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి, విభాగాధిపతి డాక్టర్ బాబూరావు, ఆచార్యులు డాక్టర్ సందీప్, డాక్టర్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఏలూరు స్పోర్ట్స్, ఏప్రిల్ 8: పాండిచ్చేరిలో ఈనెల 9వ తేదీనుంచి 15వ తేదీ వరకు జరిగే జాతీయ యూత్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా క్రీడా కారులను ఎంపిక చేసినట్లు బాస్కెట్ బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు కె.కృష్ణారెడ్డి, జి.శ్రీనివాసరావు తెలిపారు. ఈశ్వర్ తేజ, ఎస్.కిషోర్, ఎన్.సందీప్‌కుమార్, రుత్వికలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ట్రెజరర్ కె.మురళీకృష్ణ తెలిపారు.

239 ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోళ్లు : జేసీ

ఏలూరు సిటీ, ఏప్రిల్ 8 : రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం సేకరణకు జిల్లాలో 239 రైతు భరోసా కేంద్రాలు గుర్తించామని ఈ నెల 6 వ తేదీ నుంచే కొనుగోళ్ల ప్రారంభించామని జేసీ లావణ్యవేణి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో 80 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా 3.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కాగలదని అంచనా. రైతు భరోసా కేంద్రాల ద్వారా ముందుగా 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి 77 లక్షల గోనె సంచులు అవసరం అవుతాయని అంచనా వేశామని, 40 లక్షలు గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం రబీ సీజన్‌కు పండిన ధాన్యానికి గ్రేడ్ - ఏ రకానికి క్వింటాలుకు రూ. 2,203, సాధారణ రకానికి క్వింటాలుకు రూ.2,183 కనీస మద్దతు ధర నిర్ణయించారు. రైతు సొంతంగా వాహనం, లేబరు ఖర్చు, గోనె సంచులు ఉపయోగించుకుంటే రైతుకు నేరుగా సొమ్ములు చెల్లిస్తాం. ధాన్యం సేకరణ కేంద్రాలతో ఇప్పటి వరకు 98 రైస్ మిల్లులను అనుసంధానం చేశామన్నారు. సమా వేశంలో సివిల్ సప్లయిస్ డీఎం మంజుభార్గవి పాల్గొన్నారు. ఉంగుటూరు-1 సచివాలయంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో సోమవారం నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభించినట్టు ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. ఏలూరు డివిజన్‌లోని ఏడు మండలాల్లో రబీలో 57,900 ఎకరాల్లో రబీ వరి సాగు చేస్తుండగా ప్రస్తుతం 3,212 ఎకరాలకు సంబంధించి వరి కోతలు పూర్తయ్యాయన్నారు. డివిజన్‌లోని అన్ని మండలాల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని తహసీల్దార్లను ఆదేశించామన్నారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ, తహసీల్దార్ కె.వెంకట శివయ్య, వ్యవసాయ పాల్గొన్నారు.

ఐదేళ్లల్లో నియోజకవర్గానికి రూ.కోటి ఇచ్చారు

అభివృద్ధి ఎలా జరుగుతుంది : ఎలీజా



జంగారెడ్డిగూడెం,ఏప్రిల్ 8 : ఐదేళ్ల వైసీపీ పాలనలో చింతలపూడి నియోజకవర్గం అభివృద్ధికి కేవలం రూ.1కోటి మాత్రం ఇచ్చారు. ఇక అభివృద్ధి ఎలా సాధ్య పడుతుంది. పంచాయతీల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కాంగ్రె సుతోనే ప్రత్యేక హోదాతో పాటు అభివృద్ధి సాధ్యమవుతందని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. వైసీపీని వీడి కాంగ్రెసులో చేరిన తరువాత ఆయన సోమవారం జంగారెడ్డిగూడెం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నిధులు లేక ఐదేళ్లల్లో ఎటువంటి అభివృద్ధి సాధించలేక పోయామన్నారు. గ్రామ పర్యటనల సమయంలో ప్రజలు ఎన్నో సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చేవారని కానీ వాటిని పరిష్కరించే మార్గాలు లేకపోయాయన్నారు. నాయకులు సీహెచ్‌ఆర్, ఎం.ప్రసాద్‌లు ఉన్నారు.

8-04-2024
పొగాకు ధరలు (రూ.)



పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	242	225	234.42
జంగారెడ్డిగూడెం-1	242	235	240.10
జంగారెడ్డిగూడెం-2	242	235	239.68
కొయ్యలగూడెం	243	235	240.01
గోపాలపురం	242	235	239.52

తెలుగువారి తొలిపండుగ

ఉగాది..


ఏలూరులో మార్కెట్ నుంచి ఉగాదికి అవసరమైన సరుకులు తీసుకువెళుతున్న మహిళలు

విరబూసిన వేపపువ్వు, మావిచిగురు, కోకిలమ్మ గానం వసంతకాలం ఆగమనానికి చిహ్నాలు. ఉగాది తెలుగువారి తొలిపండుగ. ఈ రోజు నుంచి శ్రీక్రోధి నామ సంవత్సవం పేరుతో తెలుగు నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. హిందువులకు అత్యంత శ్రేష్టమైన ఉగాదిని తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా కేరళ, పంజాబ్, బెంగాల్, మహారాష్ట్ర, అసోం రాష్ట్రాల్లో కూడా జరుపు కుంటారు.కష్టసుఖాలను సానుకూలంగా స్వీకరించాలన్నదే ఉగాది పచ్చడిలోని ఆంతర్యం. ఈ రోజున కొత్తబట్టలు, పిండివంటలు, బంధుమిత్రుల కోలాహలం మధ్య కుటుంబాలు కళకళలాడుతాయి.

పోలవరం/ ద్వారకాతిరుమల/ ఏలూరు సిటీ/ పాలకొల్లు అర్బన్



ఈ రోజున ఏం చేయాలంటే..

ఉగాది రోజున తెల్లవారుజామునే నిద్రలేచి తలంటు స్నానం చేసి కొత్త బట్టలు దరిస్తారు. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి వసంతలక్ష్మిని ఆహ్వానిస్తారు. ఉగాది రోజున షడ్రచులతో చేసే వేప పువ్వు పచ్చడి జీవితంలో ఎదురయ్యే వివిధ అనుభవాలను స్ఫురిస్తుంది. బెల్లం తీపి ఆనందానికి సంతోషానికి ప్రతీక కాగా ఉప్పు ఉత్సాహానికి రుచికి సంకేతం. వేప పువ్వులోని చేదు బాధలకు, చింతపండు పులుపు నేర్పుగా వ్యవహరించే పరిస్థితులకు, పచ్చి మామిడి ముక్కల వగరు కొత్త సవాళ్ళకు, కారం సహనానికి ప్రతీకగా చెబుతారు. ఉగాది పచ్చడి స్వీకరించిన సందర్భంలో ఏ రుచి ముందుగా స్ఫురిస్తుందో ఆ రుచిని బట్టి వారి జీవితంలో ఎదురయ్యే అనుభవాలు ఉంటాయని చెబుతారు.ఈ ఉగాది పచ్చడి వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. తెలుగువారు ఉగాది రోజున పంచాంగ శ్రవణం చేయడం ఆచారంగా వస్తుంది. పంచాంగ శ్రవణం వల్ల సంపద, ఆయుస్సు , పాప ప్రక్షాళన, వ్యాధి నివారణ, గంగా స్నాన శుభ ఫలితాలనిస్తాయని నమ్ముతారు. ఉగాది రోజున కవి సమ్మేళనాలు నిర్వహిస్తారు.ఉగాదికి పురాణ ఇతిహాసంలో మరో కథనముంది. భాగవతంలో ధర్మం గతి తప్పి నప్పుడు అవతరిస్తానని విష్ణువు చెప్పిన విధంగా విశ్వాన్ని సృష్టించిన బ్రహ్మ నిద్రించిన సందర్భంలో సోమకాసురుడు వేదాలను తస్కరించి పారిపోతాడు. మహాప్రళయం వల్ల జలమయమై నీటి అడుగున ఉన్న సోమకాసురుడి వద్దకు మత్స్యావతారంలో వెళ్లి సోమకాసురుడిని సంహరించి వేదాలను బ్రహ్మ వద్దకు తీసుకొస్తాడు విష్ణువు. బ్రహ్మ మళ్లీ సృష్టి కొనసాగించడానికి ప్రతీకగా యుగాదిని జరుపుకుంటారు.

ఫలితాలు అంతంత మాత్రమే..

క్రోధి నామసంవత్సర ఫలితాలు సాదాసీదాగానే ఉంటాయి తొలి దశలో కొంత ఒడిదుడుకులు ఉంటాయి. పేరులోనే కొంచెం ఉగ్రం కనిపిస్తోంది.అందుకే ఈ ఏడాది ప్రారభంలో కొంత ఆవేశాలతో ప్రారంభమైనా తరువాత సామాన్యంగా సాగుతుంది. ఆహార ధాన్యాల ధరలు పెరుగుతాయి. వ్యాపారస్తులకు కొంత ఒడిదుడుకులు తప్పవు చైత్ర, వైశాఖ మాసాల్లో వడగండ్ల వానలు కురుస్తాయి. ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండటంతో అగ్ని భయాలుంటాయి. జేష్ఠ మాసంలో ధాన్యం ధరలు పెరుగుతాయి. మే 1వతేదీ నుంచి జూలై 7 వతేదీ వరకు శుక్రమౌఢ్యమి, మే 5వతేదీ నుంచి జూన్ 1 వతేదీ వరకు గురు మౌఢ్యమి ఉంటుంది. మే 1వ తేదీ నుంచి ఆగస్టు 5 వరకు శుభ ముహూర్తాలు లేవు. ఈ సంవత్సరంలో గ్రహణాలు అసలు లేవు. జూన్ 11 వతేదీ నుంచి తొలకరి వర్షాలు ప్రారంభం అవుతాయి.

-పంచాంగ కర్తలు కాశీభొట్ల ప్రసాద్ శాస్త్రి, పార్వతీశ్వర శర్మ

కోర్కె లీడేరుచుండు క్రోధి నందు..

కోపతాపాల వలయమ్ము కోరు కోక
ప్రకృతి ఒడిలోన చల్లగ పవ్వళించు
కోర్కెలెన్నియో కలలను కూర్చుచుండ
కొలను తామరై క్రోధియే యిలకు వచ్చె

నింగి నేలలు రంగుల పొంగుదాల్చి
రంగ వల్లుల వేడ్కకై రహిని గూర్చ
కూసె కోయిల చిగురులు కొరికి కొరికి
కాసె వృక్షాలు ఫలముల కలిమి నంది

ఆరు ఋతువులామని దాల్చు సంబరములు
సాగు జీవన యాత్రలో సంబరములు
వెలుగు నీడలు విరెసెడివి ద్రుమములు
అరయ ప్రకృతి సొబగులెల్ల అద్భుతములు

కోర్కెలుదయించ కూసెను కోయిలమ్మ
కుసుమ సౌగంధ్య మలమెను కొమ్మకొమ్మ
ఆరు రుచుల నందించెనీ ఆమనమ్మ
చైత్ర శోభలు చూపెడి చిత్రమమ్మ

షష్టి వర్షములివె సృష్టియారంభమున్
దెల్పుయుగాదులై తేజ మొల్కు
కాల సరోవర హేలా విలాసాలు
కన్పింప జేయుచు కదలు చుండు
మోహ మంత్రమ్ముల మహత్త్వ ప్రభలలో
జీవ జాలమ్ములు చిక్కు చుండ
అరయ నుగాదులు అలవోలె కలవోలె
యిలనేల వచ్చెను సలలితముగ

క్రోధి వత్సర మిది నేడు కొలువు తీరె
లోక బాధలు క్రోధమున్ లుప్తమవ్వ
క్రొత్తదనములు చల్లిన విత్తు లవ్వ
కోర్కె లీడేరు చుండును.

డాక్టర్ పసుపులేటి రామచంద్రరావు, తెలుగు పండితులు, జడ్పీ హైస్కూల్, కేశవరం,టి. నరసాపురం మండలం

చిన వెంకన్నకూ తొలి ఉత్సవమే..



ద్వారకా తిరుమల చినవెంకన్న క్షేత్రంలో ఉగాది పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. ఉగాది ఉత్సవాలను ఉగాది మండపంలో ప్రతిఏటా కన్నుల పండువగా జరుపుతారు. ఆలయాన్ని పరిసరాలను శోభాయమానంగా అలంకరించారు. వెండి శేషవాహనంపై ఉభయదేవేరులతో కొలువుతీరిన శ్రీవారు అట్టహాసంగా ఉగాది మండపం వద్దకు వచ్చి అక్కడి ప్రత్యేక వేదికపై కొలువుదీరుతారు. అర్చకులు, పండితులు పంచాంగ శ్రవణం చేస్తారు.

తైలాభ్యంగానికి ప్రత్యామ్నాయంగా ప్రోక్షణ



పంచకృత్య నిర్వహణలో మొదటిదైన తైలాభ్యంగానికి ప్రత్యామ్నాయంగా ఉగాది నాడు ప్రోక్షణ నిర్వహిస్తారు.నూతన సంవత్సర స్తోత్రం, నింబకుసుమ భక్షణం (ఉగాది పచ్చడి సేవనం), పూర్ణకుంభ దానం, పంచాంగ శ్రవణం, జరుగుతాయి. పండిత సత్కారం, సాంస్కృతిక కార్యక్రమాలతో శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది ఉత్సవం పూర్తవుతుంది.

-జగన్నాథాచార్యులు, ప్రధానార్చకులు

ఇక వెనక్కి వెళ్ళండి !

ఉమ్మడి జిల్లాలో 32 మంది వైద్య ఉద్యోగుల డిప్యూటేషన్లు రద్దు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 8 : పని సర్దుబాటు(వర్క్ అడ్జస్టమెంట్) పేరుతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా ఏళ్ళ తరబడి ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బందిని తక్షణమే వారివారి పాతస్థానాలకు పంపాలని వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు జారీచేసిన ఆదేశాలు సోమవారం ఒక్కసారిగా కలకలం రేపాయి. ఆయన ఆదేశాలతో ఉమ్మడి జిల్లాలో ఆయా కేడర్లలో డిప్యూటేషన్లు/వర్క్ అడ్జస్టమెంట్‌పై పనిచేస్తున్న మొత్తం 32మందిని రిలీవ్‌చేసి పాతస్థానాల్లో ఉదయం 11 గంటలకే రిపోర్ట్ చేసేలా జిల్లావైద్య ఆరోగ్యశాఖ చర్యలు తీసుకుంది. ఆదివారం సాయంత్రం జిల్లాకు అందిన ఆదేశాలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయడానికి కలెక్టర్ అనుమతి తీసుకుని, ఆ వెంటనే సంబంధిత సిబ్బంది పాతస్థానాల్లో విధులు చేపట్టడానికి చర్యలు తీసుకోవడం చకచకా జరిగిపోయాయి. తాత్కాలిక ప్రాతిపదికన చేపట్టిన డిప్యూటేషన్లు అయినందున సంబంధిత సిబ్బంది తిరిగి పాత స్థానాల్లో చేరడానికి సాంకేతికంగా ఎన్నికల కోడ్ అడ్డంకి కాబోదని డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఇలా ఉమ్మడి జిల్లాలో డిప్యూటేషన్లు రద్దయినవారిలో వైద్యాధికారులు ముగ్గురు, సీనియర్ /జూనియర్ అసిస్టెంట్లు 9, ఫార్మసిస్టులు 2, హెల్త్ ఎడ్యుకేటర్ 1, ఎంపీ హెచ్‌వోలు 3, ఎంపీహెచ్ఎస్ (ఫిమేల్) 2, ఎంఎన్‌వోలు, ఎఫ్ఎన్‌వోలు,స్వీపర్లు తదితర క్లాస్-4 సిబ్బంది 10 మంది ఉన్నారు. చాలాకాలంగా వర్క్ అడ్జస్టమెంట్లు/ డిప్యూటేషన్లపై వివాదాలు ముసురుకున్న విషయం తెలిసిందే. పలువురు ప్రజాప్రతినిదులు, ఆరోగ్యశాఖ రాష్ట్ర కార్యాలయంలో పైరవీలతో కొందరు ఉద్యోగులు తమకు అనుకూలమైన స్థానాలకు డిప్యూటేషన్లు వేయించుకోవడం, ఫలితంగా వారు పనిచేయాల్సిన వాస్తవస్థానాల్లో ఆయా విధులు నిర్వర్తించడానికి సిబ్బంది కొరత ఏర్పడటం జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో దూరప్రాంతమండలాలు, ఏజెన్సీ మండలాల నుంచి సైతం ఏలూరు, పరిసర మండలాలకు డిప్యూటేషన్లు వేయించుకుని ఏళ్ళతరబడి పాతుకుపోవడం జరుగుతోంది. ఇలా వర్క్ అడ్జస్టమెంట్‌పై తమకు నచ్చిన స్థానాల్లో పనిచేస్తున్న వారిలో కొందరు ఉద్యోగసంఘాల నాయకులు కూడా ఉండటం గమనార్హం. ఉద్యోగ నియామావళిపై రూపొందించిన సీసీఏ రూల్స్‌ప్రకారం జీతం తీసుకున్నచోటే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఏదైనా ప్రత్యేక పరిస్థితుల్లో తొలుత కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి అనుమతి తీసుకున్న తర్వాత వర్క్ అడ్జస్టమెంట్ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపి అప్రూవల్ వచ్చిన అనంతరమే డీఎంహెచ్‌వో ఉత్తర్వులు ఇస్తారు. దీనికి భిన్నంగా గతంలో పైరవీలతో డిప్యూటేషన్లు తెచ్చుకోవడం, ఆర్థికంగా లాభదాయకంగా వున్న సీట్లలో ఏళ్ళతరబడి తిష్టవేయడం పరిపాటిగా తయారైంది. ఈ సమస్య వైద్య ఆరోగ్యశాఖలో పలు కీలక కార్యక్రమాలు, పథకాల అమలుకు సిబ్బంది కొరతతో ఆటంకంగా మారడంతో డిప్యూటేషన్‌లన్నింటినీ రద్దుచేయాలన్న నిర్ణయానికి రావడంతో ఇక కదలికలు తప్పలేదు. కాగా ఒక్కసారిగా డిప్యూటేషన్లన్నింటినీ రద్దుచేయడంతో కీలకమైన విభాగాల్లో సిబ్బంది కొరత తప్పదని భావిస్తున్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ధర్నా



నూజివీడు టౌన్, ఏప్రిల్ 8: క్యాంపస్ విడిచివెళ్ళాలంటూ ఆర్జీయూకేటీ యాజమాన్యం ఆదేశాల్విడంతో విద్యార్థులు ధర్నాకు దిగారు.నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులు తమ అకాడమీ క్యాలెండర్ పూర్తయిన నేపథ్యంలో క్యాంపస్‌ను విడిచివెళ్ళాలని క్యాంపస్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దాదాపు వెయ్యి మంది విద్యార్థులకు మెసేజ్‌లను పంపింది. అయితే ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ప్రాజెక్టు, రివ్యూస్‌ను పూర్తి చేయాల్సి ఉంది. వీటి సమర్పణకు ఏప్రిల్ 10వ తేదీ చివరి రోజుగా క్యాంపస్ అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టులు సమర్పించేందుకు ప్రస్తుతం ఇచ్చిన ఆదేశాలు తమకు ప్రతిబంధక మని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఆర్జీయూకేటీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన టెక్ జెట్ వంటి టెక్‌ఫెస్ట్‌లు కూడా పూర్తికావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆర్జీయూకేటీ పరిధిలోని ఒంగోలు, శ్రీకాకుళం, ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లలో అకడమిక్ క్యాలెండర్ ఏప్రిల్ 25 వరకు అమలు చేస్తుండగా ఇక్కడ ఏప్రిల్ 8వ తేదీ చివరిరోజుగా పేర్కొంటూ క్యాంపస్‌ను విడిచి వెళ్ళాలని ఆదేశాలు జారీ చేయడంపై విద్యార్థులు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆఫీస్ బ్లాక్ వద్ద సోమవారం రాత్రి 9 గంటల వరకు నిరసన తెలిపారు. అభ్యంతరాలపై యాజమాన్యం దృష్టికి తీసుకు వెళతామని విద్యార్థులకు నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు.

క్రైం కార్నర్

160 లీటర్ల సారా స్వాధీనం



చింతలపూడి/ జీలుగుమిల్లి, ఏప్రిల్ 8:చింతలపూడి ఎస్ఈబీ సర్కిల్ పరిధిలో ఎస్ఈబీ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ గణపతి బాబు ఆధ్వర్యంలో సారాపై దాడులు జరిపి 3,800 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేశారు. 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సర్కిల్లోని నాగిరెడ్డిగూడెం, పశ్చిమయడవల్లి, కృష్ణాపురం గ్రామాల్లో దాడులు చేసి బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ముగ్గురి పై కేసు నమోదు చేసినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. ఏలూరు డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు, ఎస్సై మోహన్‌రావు పాల్గొన్నారు. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో పొలాల వద్ద సారా తయారు చేస్తున్న కొప్పుల శ్రీను అరెస్టు చేశారు. 100 లీటర్ల సారా, బైక్ సీజ్ చేశారు. 2400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భీమడోలు, ఏప్రిల్ 8 : భీమడోలు మండలం కురెళ్ళగూడెం జాతీయ రహదారిపై మోటారు సైకిల్‌పై వెళ్తున్న దుర్గాసాయిని మినీ కంటైనర్ లారీ ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు.ఏలూరు తూర్పు వీధికి చెందిన మల్లా దుర్గాసాయి (25) సోమవారం ఉదయం 11 గంటలకు బయటకు వెళ్తున్నానని చెప్పి మోటారు సైకిల్‌పై వెళ్ళాడు. కురెళ్ళగూడెం సమీపంలోని లారీ మోటారు సైకిల్‌ను ఢీకొట్టడంత అక్కడికక్కడే మృతి చెందాడు. భీమడోలు ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు కోస్తుండగా విద్యుత్ షాక్.. ఒకరి మృతి



జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 8 : పామాయిల్ గెలలు కోస్తుండగా విద్యుత్ వైర్లకు కత్తి తగిలి విద్యుదాఘాతానికి ఒక వ్యక్తి మృతి చెందాడు.లక్కవరం గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు గాంధీ (45) నిమ్మలగూడెంలో పట్టపు మునేశ్వరరావు పొలం లోకి పామాయిల్ గెలలు కోసేందుకు సోమవారం వెళ్లాడు. గెల కోస్తున్న సమయంలో హైలెవెల్ విద్యుత్ వైర్లకు కత్తి తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అతనిని లక్కవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాడు. వైద్యులు. పరీక్షించి అప్ప టికే గాంధీ మృతి చెందినట్లు నిర్ధారించారు. లక్కవరం ఎస్ఐ సుధీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు గాంధీకి భార్య సీతా మహాలక్ష్మి, కుమార్తె ఉన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

ఇద్దరు కొబ్బరి దింపు కార్మికులు మృతి



యలమంచిలి, ఏప్రిల్ 8: యలమంచిలి మండలం కాజ తూర్పు గ్రామ పరిధిలోని జాతీయరహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పూడి అప్పారావు (55), కడియాలు పెదమునియ్య (41) మృతి చెందినట్లు ఎస్ఐ కె.శివన్నా రాయణ తెలిపారు. విశాఖ జిల్లా నక్కపల్లి మండలం ఉప్మాక అగ్రహారం గ్రామానికి చెందిన పూడి అప్పారావు, చిన అనర్ల గ్రామానికి చెందిన కడియాలు పెదమునియ్య కొబ్బరి దింపు కార్మికులుగా పనిచేస్తూ జీవనోపాధి నిమిత్తం పదేళ్లుగా నుంచి అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గుడిమెళ్లంక గ్రామంలో నివాసం ఉంటున్నారు. పాలకొల్లులో కొబ్బరి దింపు తీసేందుకు అప్పారావు, పెదమునియ్యలు బైక్‌పై సోమవారం ఉదయం గుడిమెళ్లంక నుంచి పాలకొల్లు వెళుతుండగా కాజ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు అప్పారావు కుమారుడు అప్పలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మృతుడి గుర్తింపు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 8: రైలు నుంచి జారిపడి మృతి చెందిన యువకుడిని బంధువులు గుర్తించారు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమడోలు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద రైలు పట్టాలపై మృతి చెంది ఉన్న యువకుడిని బంధువులు గుర్తించారు. ద్వారకాతిరుమల మండలం గొల్లల కాలనీకి చెందిన యన్నంశెట్టి గణేష్ (22) నర్సాపురంలో ఉన్న స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కాలేజీలో ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీకి సెలవులు ఇవ్వడంతో తన స్నేహితులను కలవడానికి ఇంటి నుంచి ఈనెల 6వ తేదీన బయలుదేరి వెళ్ళాడు. అతను రైలులో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడని ఏలూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు వెల్లడించారు.


ఎమ్మెల్యే నానిని కలిసిన రాజీనామా చేసిన వలంటీర్లు

35 మంది వలంటీర్ల రాజీనామాలు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 8:ఎన్నికలు సమీపించే సరికి గ్రామవార్డు, వలంటీర్లు రాజకీయ ముసుగు తొలగింది. ఎన్నికల్లో వైసీపీ తరఫున పని చేసేందుకు సిద్ధమైన పలువురు వలంటీర్లు సోమవారం రాజీనామాలు ప్రకటించి అనంతరం అధికారపార్టీ నేతల ముందు ప్రత్యక్షమయ్యారు. జగన్ రుణం తీర్చుకుంటామంటూ ఎమ్మెల్యే ఆళ్ళ నానిని క్యాంప్ కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఏలూరు 16వ డివిజన్‌కు చెందిన 16 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా అనంతరం మహిళా వలంటీర్లు ఎమ్మెల్యే ఆళ్ళనానిని క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటామని ప్రతిజ్ఞ కూడా చేయడం విశేషం.

ఉంగుటూరు మండలంలో 12 మంది..

ఉంగుటూరు :ఉంగుటూరు మండలంలో సోమవారం బొమ్మిడి గ్రామంలో 11 మంది, కైకరం-2 సచివాలయంలో ఒకరు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో శర్మ తెలిపారు. గతంలో మండలంలోని 21 మంది వలంటీర్లు రాజీనామా చేయగా సోమవారంతో 32 మంది రాజీనామా చేసినట్లయింది.

సత్తాలలో ఏడుగురు..

ద్వారకాతిరుమల: మండలంలోని సత్తాల పంచాయతీ పరిదిలో ఏడుగురు వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి సప్తగిరికి అందించారు.

రూ.1,35,500 నగదు సీజ్

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 8 : వేగవరం చెక్‌పోస్టు వద్ద ఎస్ఎస్‌టీ సిబ్బంది తనిఖీల్లో ఎ.పోలవరం గ్రామం నుంచి జుత్తిక రామకృష్ణ ద్విచక్ర వాహనంపై రూ.1,35,500 నగదుతో జంగారెడ్డిగూడెం వస్తుండగా ఆధారాలు చూపక పోవడంతో సీజ్ చేశారు. జంగారెడ్డిగూడెం తహసిల్దార్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి స్లీవజోజికి అప్పగించారు.

ఏఎస్ఐ అని చెప్పి రూ.34 వేలు కాజేశాడు

కుక్కునూరు, ఏప్రిల్ 8 : ఏఎస్ఐ అని చెప్పి ఓ మోసగాడు రూ.34 వేలు కాజేసిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. దీనిపై కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుక్కునూరు పెట్రోల్ బంక్ యజమానికి ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో "నేను ఏఎస్ఐను మాట్లాడు తున్నాను, మా కానిస్టేబుల్ కుటుంబం ఆసుపత్రిలో ఉంది.. రూ.34 వేలు నాకు ట్రాన్స్‌ఫర్ చేయండి..మీకు డబ్బులిస్తాను" అని ఒక వ్యక్తి ఫోన్ చేశాడు. దీంతో కుక్కునూరు పెట్రోల్ బంక్ యజమాని తనది కరెంట్ అకౌంట్ కావడంతో నగదు బదిలీ చేయడం కుదరదని తెలిపారు. అనంతరం గంట తరువాత మళ్లీ ఫోన్ చేసి నగదు బదిలీ చేయాలని కోరాడు. దీంతో పెట్రోల్‌బంక్ యజమాని బంక్‌లో పనిచేసే కుర్రాడి ఫోన్ నెంబర్ ఇచ్చి అతనికి డబ్బులు ఇచ్చి నగదు బదిలీ చేయించుకోవాలని తెలిపారు. బంక్‌లో పనిచేసే కుర్రాడికి కూడా కుక్కునూరు పోలీస్‌స్టేషన్ నుంచి వచ్చే వ్యక్తి నుంచి రూ.34 వేలు డబ్బులు తీసుకుని నగదు ట్రాన్స్‌ఫర్ చేయమని చెప్పాడు. అయితే సదరు మోసగాడు పెట్రోల్ బంక్ వద్దకు రాకుండానే మాటలతో పెట్రోల్ బంక్ కుర్రాడిని ఫోన్‌లోనే బురిడీ కొట్టించాడు. దీంతో నిజంగానే ఏఎస్ఐ అని నమ్మి పెట్రోల్ బంక్ కుర్రాడు రూ.34 వేలు నగదు బదిలీ చేశాడు. అనంతరం నగదు కోసం ఏఎస్ఐ అని చెప్పి నమ్మబలికిన వ్యక్తికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో సోమవారం ఉదయం కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుక్కునూరు ఎస్ఐ రామకృష్ణ ఆ నెంబరును ట్రాక్ చేయగా బెంగుళూరు అని చూపిస్తోంది. కొన్ని రోజులుగా కుక్కునూరు మండలంలో ఆన్‌లైన్ మోసాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికే చేయూత డబ్బులు వేస్తామని చెప్పి రూ.85 వేలు ఒక మహిళ నుంచి, రూ.45 వేలు ఒక చిరు ఉద్యోగి నుంచి కాజేసిన సంఘటనలు జరిగాయి.